
సాక్షి ఒడిశా

ఆదివారం । 22 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,35,938లు, బంగారం 5.50 గ్రాములు, వెండి 20 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

తుంబా ఘాటీపై మినీ బస్సు బోల్తా

- ఇద్దరు మృతి.. 20మందికి గాయాలు
- ఛత్రపూర్ వద్ద ట్రక్కులు ఢీకొని డ్రైవర్ మృతి



- 8లో



గజపతి సేవలు మరువరానివి

- పర్లాకిమిడిలో ఘనంగా ముగిసిన గజపతి ఉత్సవాలు

- 8లో

న్యూస్‌రీల్

8 జిల్లాలకు ఎల్లో వార్నింగ్

భువనేశ్వర్: దట్టమైన పొగమంచు కారణంగా రాష్ట్రంలోని 8 జిల్లాలకు భారత వాతావరణ విభాగం(ఐఎండీ) ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఈ జాబితాలో అంగుల్, డెంకనాల్, కటక్, జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, కంధమాల్, నయాఘడ్, గంజాం, రాయ గడ, కొరాపుట్ జిల్లాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా, పూరీ, ఖుర్దా, నయాగర్, గంజాం, గజపతి, కటక్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, భద్రక్, అంగూల్, డెంకనాల్, సుందర్‌గఢ్, దేవ్‌ఘడ్, కెంజొహార్, సంబల్‌పూర్, కంధమాల్, కలహండి, బొలంగీర్, కొరాపుట్, రాయగడ జిల్లాల్లో మోస్తరుగా పొగమంచు కమ్మే అవకాశం ఉందని ఈ విభాగం పేర్కొంది. ఈనెల 23 నుంచి 25 వరకు 3 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం నెలకొంటుందని విభాగం వివరించింది.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



రోడ్డుపై పడి ఉన్న మహిళ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి కాకరపాడొ గ్రామం వద్ద ఓ మహిళ మృతదేహాన్ని స్థానికులు శనివారం ఉదయం గుర్తించారు. చిత్రకొండ సమితి దొరగూడ-పప్పులూర్ ప్రధాన రహదారిలో అనుమానాస్పదంగా మృతిచెంది ఉండటంతో పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతురాలి వివరాల కోసం ఆరా తీశారు. శుక్రవారం రాత్రి ఎవరో మహిళ గొంతు కోసి హత్య చేసి, రోడ్డు పక్కన పడవేసినట్లు గుర్తించారు. అయితే ఆమె చుట్టుపక్కల ప్రాంతానికి చెందిన వ్యక్తి కాకపోవడంతో కట్టుబొట్టు తీరు ఆధారంగా ఆంధ్రప్రదేశ్ ప్రాంతం నుంచి వచ్చినట్లు భావిస్తున్నారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులు ఎవరైనా సంప్రదిస్తే అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

కళ్లు కప్పబోయి..

- నకిలీ బంగారు శంఖం విక్రయిస్తూ కిడ్నాపైన యువకుడు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ శంఖం


కొరాపుట్: నకిలీ బంగారు శంఖం విక్రయించబోయి కిడ్నాపైన యువకుడిని పోలీసులు రక్షించారు. నవరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి మైదల్‌పూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఎస్‌డీపీఓ ఆదిత్యసేన్ వివరాలను వెల్లడించారు. మైదల్‌పూర్ సమీపంలోని చంద్రపూర్ గ్రామానికి చెందిన రవీంద్ర మిర్గాన్ నకిలీ బంగారు శంఖాన్ని విక్రయించేందుకు ప్రయత్నించాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భేతాల్ ప్రాంతానికి చెందిన బాబాదివ్య శంకర్ దుబేను ముగ్గులోకి దింపాడు. బంగారు శంఖం చాలా పురాతనమైనదని, చాలా అద్భుతమైన శక్తులు ఉన్నాయని నమ్మబలికాడు. రూ.2 లక్షలకు బేరం కుదురగా, అడ్వాన్సుగా రూ.50 వేలు తీసుకున్నాడు. శంఖం అందుకున్న బాబా.. దానిని తణిఖీ చేయగా నకిలీదని గుర్తించాడు. దీంతో రవీంద్రను పట్టుకోవాలనే ఉద్దేశంతో మిగతా డబ్బు తీసుకొవడానికి తనతో రావాలని వెంటే మధ్యప్రదేశ్ తీసుకు వెళ్లాడు. అక్కడే బంధించి, తనకు రూ.6 లక్షలు ఇస్తేనే రవీంద్రను విడిచి పెడతానని కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు జిల్లా ఎస్పీ ఎస్.సుశ్రీని ఆశ్రయించి, సాయం చేయాలని వేడుకున్నారు. దీంతో నవరంగ్‌పూర్ నుంచి పోలీసులు మధ్యప్రదేశ్ వెళ్లి, అక్కడి పోలీసుల సహకారంతో రవీంద్ర, బాబాను అదుపులోకి తీసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి, జైలుకి తరలించారు. సమావేశంలో ఎస్ఐ నట్వర నందో, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌డీసీ సభ్యులకు ఘన స్వాగతం

కొరాపుట్: జిల్లా స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సభ్యులకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అభినందన సభ శనివారం జరిగింది. కౌన్సిల్ అధ్యక్షుడు చంద్రోశేఖర్ మాఝి, ఉపాధ్యక్షురాలు లక్ష్మీహంతాల్, ఇతర 24మంది సభ్యులకు పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో కొరాపుట్ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి, ఎస్‌డీసీ కౌన్సిల్ సలహాదారుడు ప్రదీప్ మాఝి, ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

रक्षा मंत्रालय
MINISTRY OF DEFENCE
सत्यमेव जयते

REPUBLIC DAY CELEBRATIONS 2023



సైనికా.. సలామ్

- సందేశాత్మకంగా గణతంత్ర దినోత్సవాల నిర్వహణకు కసరత్తు
- విద్యార్థులకు క్రాఫ్ట్ ప్రాజెక్టు నిర్వహిస్తోన్న రక్షణ మంత్రిత్వశాఖ
- ప్రతి ప్రాజెక్టు సరిహద్దులోని జవాన్లకు చేరవేసేలా కార్యాచరణ
- జిల్లాలకు మంత్రులను ఇన్‌చార్జులుగా ప్రకటించిన రాష్ట్రప్రభుత్వం
- ఉదయం 9.30 గంటలకు జాతీయ పతాకం ఆవిష్కరించేలా సన్నాహాలు



భువనేశ్వర్: భారత 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశంలోని అన్ని విద్యాసంస్థల్లో ఈనెల 26న ఉదయం ఉదయం 9.30 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరణ కార్యక్రమం జరుగనుంది. కోవిడ్ పరిస్థితి దృష్ట్యా వర్చువల్ లేదా నేరుగా విద్యాధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలను అట్టహాసంగా చేపట్టనున్నారు. అనుకూల పరిస్థితుల్లో అన్ని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు వేడుకల్లో ప్రత్యక్షంగా పాల్గొంటారు. మరోవైపు 75 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలు జరుపుకొంటున్న తరుణంలో ప్రతి పాఠశాల విద్యార్థి క్రాఫ్ట్ ప్రాజెక్ట్‌ను సిద్ధం చేసి సరిహద్దులో మోహరించిన జవాన్లకు పంపనున్నారు. వీటిని జవాన్లకు చేరవేసే అంశాన్ని రక్షణ మంత్రిత్వశాఖ పర్యవేక్షిస్తుంది. పాఠశాల తెరవలేని పరిస్థితుల్లో పిల్లలు ఇళ్ల నుంచే ప్రాజెక్ట్‌లను సమర్పించవచ్చు. 'వేస్ట్ టు బెస్ట్', 'వేస్ట్ టు వెల్త్' అనే అంశంపై ప్రాజెక్టులు సిద్ధం చేయాలి. అన్ని క్రాఫ్ట్ ప్రాజెక్ట్‌లు/మోడళ్లపై పాఠశాల పేరు, ఇతర వివరాలతో ఆర్‌డీసీ వెబ్‌సైట్ www.indianrdc.mod.gov.inలో ప్రసారం చేస్తారు. ఉత్తమ ప్రాజెక్టులకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుంది.

విజేతలకు బహుమతులు..

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా వందేమాతరం, వీరగాథ కార్యక్రమాలు కేంద్రప్రభుత్వం ఖరారు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు చేపడతాయి. 25లోగా విద్యాసంస్థల స్థాయిలో ఉపన్యాసాలు, నాటికలు, వ్యాసరచన, క్లాస్ ప్రాజెక్ట్స్ వంటి పోటీలు నిర్వహించి గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 26న విజేతలకు బహుమతులు ప్రదానం చేయాలని కేంద్ర రక్షణ మంత్రిత్వాశాఖ తెలిపింది.

ఎవరు.. ఎక్కడ?

ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా భువనేశ్వర్‌లో జరగనున్న రాష్ట్ర పరేడ్‌లో గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ గౌరవ వందనం స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గౌరవ అతిథిగా హాజరుకానున్నారు. 20 జిల్లాల్లో మంత్రులు జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. గజపతి జిల్లాలో మంత్రి జగన్నాథ్ సరక, కటక్ జిల్లాలో మంత్రి నిరంజన్ పూజారి, గంజాంలో మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వాయి, సువర్ణపూర్‌లో మంత్రి ప్రదీప్‌కుమార్ అమత్, జగత్‌సింగ్‌పూర్ జిల్లాలో ప్రమీలా మల్లిక్, కియోంజర్‌లో మంత్రి ఉషాదేవి. కేంద్రపడాలో ప్రఫుల్లకుమార్ మల్లిక్, పూరీలో మంత్రి ప్రతాప్‌కేశరి దేవ్, డెంఖనాల్‌లో అతున్ సవ్యసాచి నాయక్, కలహండిలో మంత్రి నవకిశోర్ దాస్, మల్కన్‌గిరిలో మంత్రి టుకుని సాహు, మయూర్‌భంజ్ జిల్లాలో అశోక్‌చంద్ర పండా, బర్‌గడ్ జిల్లాలో మంత్రి రాజేంద్ర ధోలాకియా, బాలాసోర్ జిల్లాలో మంత్రి సమీర్‌రంజన్ దాస్, సుందర్‌గఢ్‌లో మంత్రి ప్రీతిరంజన్ ఘడేయ్, కంధమల్‌లో మంత్రి శ్రీకాంత్ సాహు, కొరాపుట్‌లో మంత్రి తుషార్‌కాంతి బెహరా, బొలంగీర్‌లో మంత్రి రోహిత్ పూజారి, సంబల్‌పూర్ జిల్లాలో మంత్రి రీతా సాహు, దేవ్‌ఘర్‌లో మంత్రి బసంతి హేమంబ్రం, అంగూల్, భద్రక్, బౌధ్, జాజ్‌పూర్, జార్సుగూడ, ఖుర్దా, నువాపాడ, నవరంగ్‌పూర్, నయాగఢ్, రాయగడ జిల్లాల్లో స్థానిక కలెక్టర్లు జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. బరంపురంలో ఆర్‌డీసీ(దక్షిణ), రౌర్కెలాలో ఆర్‌డీసీ(ఉత్తర) ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా పాల్గొనున్నారు.

ఓటు బ్యాంకు పటిష్టం చేయాలి

- బీజేపీ కార్యకర్తలకు సుందర్‌ఘడ్ ఎంపీ జుయల్ ఓరం పిలుపు



లక్ష్మీపూర్ సమావేశానికి హాజరైన బీజేపీ కార్యకర్తలు



సిమిలిగుడలో సంఘ్ పరివార్ నాయకులకు నివాళులర్పిస్తున్న జుయల్ ఓరం

కొరాపుట్: భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, సుందర్‌ఘడ్ ఎంపీ జుయల్ ఓరం కొరాపుట్ జిల్లాలో పర్యటించారు. జిల్లాలోని సిమిలిగుడలో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లాలో గిరిజనుల ఓటు బ్యాంక్ పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పటి వరకు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి చేసిన కార్యక్రమాలను వివరించాలని సూచించారు. అనంతరం లక్ష్మీపూర్ సమితి కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. రాష్ట్రానికి చెందిన ద్రౌపది ముర్మును దేశానికి రాష్ట్రపతిగా చేసిన పార్టీ ఘనతను క్షేత్రస్థాయిలో వివరాలని తెలిపారు. సమావేశాల ప్రారంభానికి ముందు సంఘ్ పరివార్ నాయకుల చిత్ర పటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బుల్లు సాహు, సుమంత్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరు వెళ్లినా నష్టం లేదు..

కొరాపుట్ జిల్లాల గిరిజన నాయకులు భారతీయ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్)లో చేరినా తమ పార్టీకి ఎటువంటి నష్టం లేదని సుందర్‌ఘడ్ ఎంపీ, బీజేపీ నాయకుడు, కేంద్ర స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడు జుయల్ ఓరం అన్నారు. జిల్లా కేంద్రంలోని సర్క్యూట్ హౌస్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో పై విధంగా మాట్లాడారు. ఇటీవల కొరాపుట్ మాజీ ఎంపీలు జయరాం పంగి, గిరిధర్ గొమాంగో బీఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌ను కలిసిన విషయంపై స్పందించారు. జయరాం కొంతకాలం క్రితం బీజేపీకి రాజీనామా చేయగా, గిరిధర్, అతని కుమారుడు శిశిర్ గొమాంగొ ఇంకా బీజేపీలో కొనసాగుతున్నారని గుర్తుచేశారు. ఇటువంటి నేతలు బీఆర్ఎస్‌లో చేరినా బీజేపీకి నష్టం లేదన్నారు. గిరిజనులంతా తమవెంటే ఉన్నారని, రాష్ట్రానికి చెందిన ద్రౌపది ముర్మును రాష్ట్రపతి చేసిన ఘనత బీజేపీదే అని తెలిపారు. ఎవరు పార్టీని వీడినా గిరిజనులు భారతీయ జనతా పార్టీని వదలరని విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ కొరాపుట్ శాఖ అధ్యక్షుడు సుమంత్ ప్రధాన్ పాల్గొన్నారు.



ధాన్యాన్ని ఏనుగులు ధ్వంసం చేసాయని చూపిస్తున్న రైతు

గజ'గజ'

- బలియాగుడలో బీభత్సం సృష్టిస్తున్న ఏనుగులు



టమ్మనా అడవిలో సంచరిస్తున్న ఏనుగులు

బరంపురం: గంజాం జిల్లా బరంపురం అటవీరేంజ్ పరిధిలో నగరానికి 5కిలోమీటర్ల సమీపంలోని బలియాగుడ గ్రామంలో గజరాజులు బీభత్సం సృష్టించాయి. గత 2 రోజుల్లో లకాడి పర్వతాల నుంచి అర్ధరాత్రి సమయంలో గ్రామంలోకి గుంపుగా చొరబడి భీకర అరుపులతో గ్రామస్తులను భయాందోళనకు గురిచేశాయి. తాజాగా శుక్రవారం రాత్రి టమ్మనా ఘాటీ రహదారి మీదుగా బల్లియాపడా గ్రామంలోకి చొరబడ్డాయి. కళ్లాల్లో ఉన్న ధాన్యం బస్తాలు తినేయడంతో పాటు పంటలను ధ్వంసం చేశాయి. దీంతో గ్రామస్తులంతా రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు. దీనిపై సమాచారం అందుకున్న బరంపురం అటవీశాఖ రేంజర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. రేంజర్ అమరేష్‌కుమార్ దాస్ నేతృత్వంలో సిబ్బంది గజరాజుల గుంపును తిరిగి అటవీ ప్రాంతంలోకి తరిమేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. పదేపదే గ్రామాల్లోకి చొరబడటంతో ఏ క్షణాన ఏం జరుగుతుదోనని ఆందోళన చెందుతున్నామని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు నష్టపోయిన పంటకు పరిహారం ఇప్పించాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

'ప్రైవేటు'కు లాభదాయకం

- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 12 ప్రతిపాదనలకు ఆమోదం
- వివరాలు వెల్లడించిన ఎస్ఆర్‌సీ ప్రదీప్ జెనా



కేబినెట్ సమావేశం వివరాలు తెలియజేస్తున్న ఎస్ఆర్‌సీ ప్రదీప్‌కుమార్ జెనా

భువనేశ్వర్:

రాష్ట్ర మంత్రివర్గం 12 ప్రతిపాదనలు ఆమోదించింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన శనివారం మంత్రి మండలి సమావేశం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలను రాష్ట్ర అభివృద్ధి కమిషనరు ప్రదీప్‌కుమార్ జెనా ఈ సమావేశం సంక్షిప్త వివరాలు మీడియాకు వివరించారు. ప్రైవేటు కళాశాల ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ పెంపు ప్రతిపాదనకు ఆమోదం లభించింది. 2022 జనవరి 1 నుంచి ఈ పెరుగుదల అమలవుతుంది. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 15,711 మంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది లబ్ధి పొందుతారు. రాష్ట్ర ఖజానాపై రూ.290 కోట్ల వ్యయ భారం పడుతుందని వివరించారు. నైపుణ్యత అభివృద్ధి మరింత క్రియాశీలకం ఎంప్లాయిమెంట్ ఎక్స్‌చేంజిల్లో ఎంప్లాయిమెంట్ అధికారి ఖాళీ పోస్టుల భర్తీ కోసం అనుబంధ చట్టం సవరణకు కేబినెట్ అంగీకరించింది. నైపుణ్యత అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు ఎంప్లాయిమెంట్ అధికారి పోస్టుల భర్తీ అనివార్యంగా గుర్తించారు. ఇతర వెనుకబడిన తరగతుల(ఓబీసీ) కమిషన్ చట్టం సవరణకు ఆమోదముద్ర వేసింది. తాజా సవరణతో ఓబీసీ జాబితాలో కొత్తగా 22 వెనుకబడిన జాతులను జోడించేందుకు మార్గం సుగమమైంది. ఈ జాతులు కేంద్ర జాబితాలో చోటు చేసుకుని ఉంటే రాష్ట్ర జాబితాలో చేర్చాలని మంత్రిమండలి స్పష్టం చేసింది.

సువర్ణరేఖపై హై లెవెల్ వంతెన..

మల్కన్‌గిరి జిల్లాలో 4 భారీ తాగునీటి ప్రాజెక్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 4 మండలాల పరిధి 61 గ్రామ పంచాయతీల్లో 453 గ్రామాల 3,13,620 మంది లబ్ధి పొందుతారు. ఖుర్దా జిల్లా జట్నీ తహసీల్ ఛండీహత్తా గ్రామంలో కేన్సర్ రోగుల వసతి సముదాయం నిర్మాణం కోసం బాగ్చి శ్రీశంకర కేన్సర్ కేర్ సెంటర్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సంస్థకు 2 ఎకరాల స్థలం కేటాయించేందుకు మంత్రిమండలి పచ్చజెండా ఊపింది. బాలాసోర్ జిల్లా జలేశ్వర్ పాత జాతీయ రహదారి గొబొరొఘాట్ ప్రాంతం సువర్ణరేఖ నదిపై హై లెవెల్ వంతెన నిర్మాణానికి కేబినెట్ ఆమోదించింది. రూ.101,66,34,590ల వ్యయంతో 36 నెలల కాల పరిమితిలో దీని నిర్మాణం పూర్తి చేయాలని కేబినెట్ ఆదేశించింది.

సమైక్యతతో ఉగాది వేడుకలు

- రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు



ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ భాస్కరరావు

రాయగడ: తెలుగు ప్రజల సంస్కృతికి అద్దం పట్టే ఉగాది వేడుకలు సమైక్యతగా నిర్వహిద్దామని రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు పిలుపునిచ్చారు. ఆయన నివాసంలో ఉగాది వేడుకల నిర్వహణకు సంబంధించి ప్రజాభిప్రాయ సమావేశం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంతమంది స్వార్థపరులు ఉత్సవాల నిర్వహణలో అడ్డంకులు ఏర్పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యతకు అద్దం పట్టే ఈ ఉత్సవాలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలని కోరారు. ఒకప్పుడు నామమాత్రంగానే జరిగే ఉత్సవాలను.. 2013 నుంచి అంతా ఏకమై ఒకే వేదికపై ఘనంగా నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. కరోనా కారణంగా గత రెండేళ్లు ఉత్సవాలకు ఆటంకం ఏర్పడిందన్నారు. పరిస్థితులు అనుకూలించడంతో ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. తెలుగువారి ఐక్యతను దెబ్బకొట్టే విధంగా వేరు కుంపటి పెట్టడం సమంజసం కాదన్నారు. అంతాకలిసి ఒకే వేదికపై నిర్వహించేందుకు ముందుకు రావాలని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు రాఘవ కుముంధాన్, చంద్రమౌళి కుముంధాన్, శిల్లా జగన్నాథ స్వామి, న్యాయవాది వీఎస్ఎన్ రాజు, మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రవాశాంధ్రలో తెలుగు విద్యావిధానంలో తీరని సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని, దీనివల్ల భవిష్యత్ తరాలకు ఎనలేని ముప్పు ఉంటుందని తెలియజేశారు.

కొండబాబు ఆధ్వర్యంలో..



సమావేశానికి హాజరైన పట్టణ ప్రముఖులు

ఇదిలా ఉండగా స్థానిక బీజేడీ సీనియర్ నాయకుడు ఎల్ల కొండబాబు ఆధ్వర్యంలో స్థానిక గ్రామదేవత బురదల పోలమ్మ మందిరంలో ఉగాది వేడుకల నిర్వహనకు సంబంధించి సమావేశం శనివారం జరిగింది. భైరవీధి, మజ్జివీధి, ఎద్దువీధి, పిట్లవీధి తదితర ప్రాంతాలకు చెందిన తెలుగు వారు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉగాది వేడుకల నిర్వహణపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. సమావేశంలో కాశినాయుడు, టి.గౌరీశంకరరావు, జిల్లా పరిషత్ సభ్యుడు ధవళేశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లాకు ఏపీ ఎస్‌పీఎఫ్ డీజీపీ రాక



ఎస్‌పీఎఫ్ డీజీపీ సంతోష్ మెహ్రాను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీపీ సంతోష్ మెహ్రా శనివారం రాత్రి జిల్లా పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా డీజీపీని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఎస్పీ జి.ఆర్.రాధిక మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నైపుణ్యంతోనే గుర్తింపు



ఆర్ఎస్ఐ మంగలక్ష్మిని అభినందిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : నైపుణ్యం, ప్రతిభలే ఉద్యోగికి గుర్తింపు తీసుకొస్తాయని ఎస్పీ జి.ఆర్.రాధిక కొనియాడారు. ఏలూరు జిల్లా పెదవేగి పోలీసు శిక్షణా కేంద్రంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన మహిళా ఆర్ఎస్ఐ ఐయితిరెడ్డి మంగలక్ష్మి, ఆర్మ్డు రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్ ఎ.జనార్దనరావులు ప్రతిభ కనబరచడంతో శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. 45 రోజుల శిక్షణా కాలంలో మంగలక్ష్మి రాష్ట్ర స్థాయి బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్ ట్రైనింగ్‌లో ఆల్‌రౌండ్ విభాగంలో ద్వితీయస్థానం, జనార్దనరావు శిక్షణలో ప్రతిభ చూపినందుకు ఏ-గ్రేడ్ శ్రేణిలో నిలిచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో జిల్లా పోలీసు శాఖలో పనిచేసే సిబ్బందికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ డి.ప్రసాదరావు, ఆర్ఐలు బి.ప్రదీప్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు ఈకేవైసీ తప్పనిసరి



కొత్తూరు సబ్ ట్రెజరీలో వార్షిక తనిఖీలు నిర్వహిస్తున్న డీడీ రవికుమార్

కొత్తూరు: జిల్లాలో అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు జీఓ-7 ప్రకారం బ్యాంకు ఖాతాలకు ఆధార్ నంబర్ అనుసంధానం చేయడంతో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా ట్రెజరీ డీడీ సీహెచ్ రవికుమార్ సూచించారు. కొత్తూరు ఉప ఖజానా కార్యాలయంలో శనివారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 40,486 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు గాను ఇంత వరకు 21,236 మంది మాత్రమే ఆధార్ అనుసంధానం, ఈకేవైసీ చేసుకున్నట్లు వివరించారు. ఆధార్ అనుసంధానం, ఈకేవైసీ చేయడం వల్ల పెన్షన్ రద్దు అవుతుందనే అపోహను వీడాలన్నారు. పెన్షనర్లు ఫిబ్రవరి 28లోపు లైఫ్ సర్టిఫికెట్లను సబ్ ట్రెజరీలకు అందజేయాలన్నారు. జిల్లాలో 16464 మంది పెన్షనర్లకు పింఛన్లు చెల్లిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌టీఓలు సీహెచ్ సమతా రాణ, వై.మధుసూదనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

శ్రీకాకుళం క్రైమ్ : పట్టణంలోని దమ్మలవీధిలో మద్యం అక్రమంగా అమ్ముతూ ఓ వ్యక్తి పట్టుబడిన ట్లు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ శనివారం తెలిపారు. దమ్మల వీధికి చెందిన అల్లిపల్లి వాసుదేవరావు (35) ఆరు మద్యం బాటిళ్ల ను అమ్ముతుండగా మాటువేసి పట్టుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

దళిత మహిళపై దాడి

పోలాకి: మండలంలోని బెలమర గ్రామానికి చెందిన గొర్లె సత్యం అనే వ్యక్తి తనపై దాడి చేసినట్లు అదే గ్రామానికి చెందిన దళిత మహిళ సబ్బి లక్ష్మి శనివారం పోలాకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. సబ్బి లక్ష్మి తన ఇంటికి ఆనుకున్న ఉన్న ప్రభుత్వ స్థలంలో వరిగడ్డికుప్ప పెట్టుకుంది. అక్కడ గడ్డికుప్ప తొలగించాలని కాలనీవాసులు కొన్ని రోజులుగా తగాదాపడుతున్నారు. ఈ క్రమంలో గొర్లె సత్యం అనే వ్యక్తి మద్యం మత్తులో స్థానిక సర్పంచ్ ఇంటికి వెళ్లి హెచ్చరిస్తూ అక్కడి నుంచి వచ్చి గడ్డికుప్పకు నిప్పు పెట్టాడు. అనంతరం లక్ష్మిపై దాడికి పాల్పడ్డాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధితురాలి ఫిర్యాదు మేరకు సత్యంపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ నర్సింహమూర్తి తెలిపారు. కాగా, దళిత మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కె.లక్ష్మణరావు, దళితహక్కుల పోరాట కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి డిమాండ్ చేశారు.

ఆదివాసీల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఎస్‌డీసీ ముఖ్య సలహాదారుడు ప్రదీప్ మాఝి



ఆకట్టుకున్న కళాకారుల కోయ నృత్యం



విలేకర్లతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి సరక



సాహస యువతి ఆకాంక్షను సన్మానిస్తున్న ఎస్‌డీసీ చైర్మన్ ప్రదీప్ మాఝి

రాయగడ: ఆదివాసీల ఆర్థిక, సామాజిక రంగాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎస్‌డీసీ) ముఖ్య సలహాదారుడు ప్రదీప్ మాఝి అన్నారు. జిల్లా కేంద్రంలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం సాయంత్రం జరిగిన మూడో రోజు చొయితి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఆదివాసీల ప్రత్యేక అభివృద్ధి కోసం ఎస్‌డీసీని ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌దే అని తెలిపారు. ఏటా కోట్లాది రుపాయల నిధులు వివిధ అభివృద్ధి పథకాల పేరిట వెచ్చిస్తున్నారన్నారు. రాష్ట్రంలని ఆదివాసీల్లో, ప్రధానంగా అవిభక్త కొరాపుట్ జిల్లాల్లోని డొంగ్రియా, లంజియా సవర, బొండా వంటి తెగలు అత్యధికంగా నివసిస్తున్నారని పేర్కొన్నారు. కొండ కోనల్లో నివసించే వీరంతా ఇప్పటికీ అడవి తల్లిని నమ్ముకొని జీవనాన్ని కొనసాగించడం ప్రకృతిపై ఆదివాసీల ప్రేమకు నిదర్శనమన్నారు. అయితే అమాయకత్వం, నిరక్ష్యరాస్యత కారణంగా పురోగతి సాధించలేక పోవడం విచారకరమన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని, వారిలో చైతన్యం తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని వెల్లడించారు.

ఆదివాసీల్లో సమరయోధులు

స్వాతంత్ర్య సమరంలో ఎంతోమంది ఆదివాసీలు దేశం కోసం ప్రాణాలర్పించారని మాఝి వివరించారు. బిర్సాముండా, సహీద్ లక్ష్మణ్ నాయక్ వంటి మహానీయుల త్యాగాలు ఆదివాసీల దేశభక్తికి నిదర్శనాలుగా చిరకాలం నిలుస్తాయన్నారు. చొయితి ఉత్సవాలు అంబరాన్ని తాకుతున్నాయని, ప్రజల నుంచి ఇంతటి స్పందన రావడం విశేషమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డిసి చైర్మన్ అనసూయ మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, బిజూ స్వస్థ్య సమితి ముఖ్య సలహాదారుడు సుధీర్ దాస్, ఆదివాసీ కల్యాణ సమితి సలహాదారుడు పృధ్వీరాజ్ సాహు, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ మున్సిపాలిటీ చైర్మన్ మమత గౌడొ తదితరులు పాల్గొన్నారు.

స్టెప్పులేసిన మంత్రి..

చొయితి ఉత్సవాల్లో పాల్గొన్న రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖమంత్రి జగన్నాథ సరక స్థానిక విలేకర్లతో కలిసి వేదికపై కొద్దిసేపు నృత్యం చేశారు. కొరాపుటియా, సంబల్‌పూరి పాటలకు ఆయన లయబద్ధంగా వేసిన నృత్యం ప్రేక్షకులను ఆనందింపజేసింది. అందరూ ఆనందించాల్సిన సమయమిది, సుదీర్ఘకాలం అనంతరం ఉత్సవాలు జరుపుకోవడం ఎంతో ఆనందాన్నిస్తుందని తెలిపారు. అలాగే ప్రముఖ ఒడియా చలనచిత్ర నేపథ్య గాయని ఆసీమా పండా ఆధ్వర్యంలో జరిగిన ఆర్కెస్ట్రా ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. ఆధునిక సినీ పాటలతో పాటు సంబల్‌పూరి, కొరాపుట్ దేశీయ పాటలు పాడి ఆనంద డోలికల్లో ముంచెత్తారు. అనంతరం వివిధ నృత్య ప్రదర్శనలు రంజింపజేశాయి.

సాహస యువతికి సన్మానం

చొయితి ఉత్సవాల్లో భాగంగా పలువురు విద్యార్థులను వేదికపై సన్మానించారు. 2022 జూన్ 15న మోనాలీలోని రోహితాంగ్‌పాస్ మంచుకొండల దృశ్యాలను ఆస్వాదించేందుకు వెళ్లిన రాయగడకు చెందిన యువతి ఆకాంక్ష సాహు.. రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించిన సాహసాన్ని జిల్లా యంత్రాంగం గుర్తించింది. ఈ సందర్భంగా ఎస్‌డీసీ ముఖ్యసలహాదరుడు ప్రదీప్ యువతిని ప్రశంసించి, సత్కరించారు. ఆమె సాహసం ఇతరులకు ఆదర్శనీయంగా మారాలన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గజపతి సేవలు మరువరానివి

- ఒడిశా ఏవీ సంచాలకులు సంగ్రాం కేసరి మహాపాత్రో
- పర్లాకిమిడిలో ఘనంగా ముగిసిన గజపతి ఉత్సవాలు



ఏసీఎఫ్ఓ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు జ్ఞాపికను బహుకరిస్తున్న కలెక్టర్ లింగరాజ్ పండా



దివ్యాంగ క్రీడాకారి పూజా అశ్వినీ నాయక్‌ను సత్కరిస్తున్న ప్రశాంత్‌కుమార్ మిశ్రా



కళాకారులను సన్మానిస్తున్న ఓఏవీ సంచాలకులు సంగ్రాంకేసరి మహాపాత్రో



సంస్కృతి భారత్ సంస్థ కళాకారిణుల ఒడిస్సీ నృత్యం



కార్యక్రమానికి హాజరైన అధికారులు, అతిథులు

పర్లాకిమిడి: తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా 1936 ఏప్రిల్ 1న ఒడిశా ఆవిర్భావం దివంగత కృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ కృషి కారణంగానే సాధ్యమైందని ఒడిశా ఆదర్శ విద్యాలయం సంఘటన్, సంచాలకులు సంగ్రాంకేసరి మహాపాత్రో అన్నారు. గజపతి ఉత్సవాలు మూడోరోజు ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ లింగరాజ్ పండా, ఏడీఎం సంగ్రాం శేఖరపండా, గంజాం జిల్లా ముఖ్య అటవీ సంరక్షణాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, గంజాం, గజపతి జిల్లాల డీఎఫ్ఓ అమ్లాన్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓఏవీ మాట్లాడుతూ పర్లాకిమిడి పుణ్యభూమి అని, ఉత్కళ గుర్తింపు కోసం పర్లాకిమిడి మహారాజా బ్రిటీష్ వారితో పోరాడి రెండుసార్లు లండన్ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు వెళ్లి సాధించారని తెలిపారు. ఏసీఎఫ్ఓ ప్రశాంత్‌కుమార్ మిశ్రా మాట్లాతుతూ గజపతుల కాలంలో అనేక ఔషధ మొక్కలు మహేంద్రగిరిలో నాటారని, శ్రీలంక, హిమాలయాల్లో దొరికే మొక్కలు ఇక్కడే ఉన్నాయన్నారు. వాటిని గుర్తించగలిగితే అనేక రోగాలకు మందు దొరిగే సూచనలు ఉన్నాయని అభిప్రాయం వ్యక్తంచేశారు. గజపతి జిల్లాలో కళలు, నృత్యం, సంగీతం, క్రీడా రంగాల్లో ఆరితేరిన వారు ఎందరో ఉన్నారని, మహిళా స్వశక్తీకరణ, క్రీడారంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిందని ఏడీఎం సంగ్రాంశేఖర పండా అన్నారు. అనంతరం పలువురు అతిథులను గౌరవంగా సత్కారించారు. క్రీడల్లో రాణిస్తున్న ఏఎస్ఐ కిశోర్‌చంద్ర రథ్, హిమాలయ పర్వతారోహకుడు గణేష్ నాయక్, దివ్యాంగ క్రీడాకారిణి పూజాఅశ్వినీ నాయక్ అను సత్కరించారు. అనంతరం హర్యాణా ఫోగ్ లోకనృత్యం, గుజరాత్, నువాగడ బ్లాక్ లోక్‌నృత్యం, జగన్నాథ నికేతన్ ఆశ్రమ విద్యార్థుల నృత్యాలు, భువనేశ్వర్‌కు చెందిన రస్మి రంజన్ మిశ్రా ఆధ్వర్యంలో సంస్కృతి భారత్ సంస్థ ఒడిస్సీ నృత్యం ఆహూతులను అలరించాయి.

తుంబా ఘాటీపై మినీబస్సు బోల్తా



తుంబాఘాటీపై బోల్తా పడి ఉన్న బస్సు



మృతిచెందిన సరస్వతి సబర(16)

- ఇద్దరు మృతి.. 20మందికి గాయాలు
- ఛత్రపూర్ వద్ద ట్రక్కులు ఢీకొని డ్రైవర్ మృతి



రాకపోకలు నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు

బరంపురం: గంజాం-గజపతి జిల్లాల సరిహద్దు తుంబా ఘాటీలో ప్రయాణికుల మినీ బస్సు బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మహిళలు మృతిచెందగా, మరో 20మంతి గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న జరడా పోలీసులు, అగ్నిమాపక శిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను రక్షించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం సాయంత్రం గజపతి జిల్లా రాయఘడ్ నుంచి 30మంది ప్రయాణికులతో ప్రైవేట్ మినీ బస్సు గంజాం జిల్లా పత్రపూర్ బయలుదేరింది. అయితే ఘాట్ రోడ్డులో తీవ్రంగా మంచు కురవడంతో రహదారి కనిపించక అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలు మృతిచెందారు. మరో 20మంది ప్రయాణికులకు గాయాలు కాగా, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని, సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను 108 అంబులెన్స్‌లో పత్రపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, చికిత్స అందించారు. మృతులు గంజాం జిల్లా పత్రపూర్ బ్లాక్ సుకిలిపదరో గ్రామానికి చెందిన సరస్వతి సబర (16), ఆరకపదరో గ్రామనికి చెందిన సుమతి రౌళో (28)గా గుర్తించారు. వారి మృతదేహాలను స్వాధీనం చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం బరంపురం ఎంకేసీజీ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ట్రక్కులు ఢీ

శనివారం వేకువజాము 4.30గంటల సమయంలో జిల్లా కేంద్రం ఛత్రపూర్ పరిధిలో 16వ నంబర్ జాతీయ రహదారి పుకిడిబొందొ జంక్షన్ వద్ద జరిగిన రోడ్డ ప్రమాదంలో ట్రక్కు డ్రైవర్ మృతిచెందాడు. భువనేశ్వర్ వైపు వెళ్తున్న ట్రక్కు, ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తున్న ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న చమ్మఖండి పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, ఎంకెసీజీకి తరలించి, కేసు నమోదు చేశారు.

జానపద సంపదను పరిరక్షించుకోవాలి



మహాసభలో మాట్లాడుతున్న సినీగేయ రచయిత డాక్టర్ అందెశ్రీ



విభిన్న వాయిద్య పరికరాలతో సేకర్త జయధీర్ తిరుమలరావు

పలాస/కాశీబుగ్గ: ఉత్తరాంధ్రలో అపారమైన జానపద సంపద ఉందని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత యువ కవులు, రచయతలపై ఉందని ప్రముఖ కవి, పరిశోధకుడు జయధీర్ తిరుమలరావు చెప్పారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ఎస్.ఎం.సి ఫంక్షన్ హాలులో శనివారం ఉదయం ఉత్తరాంధ్ర రచయతల మహాసభలు జరిగాయి. సాయంత్రం సినీనటుడు, ప్రముఖ జానపద కళాకారుడు డాక్టర్ కుమార్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో ఉత్తరాంధ్ర జానపదాలు అనే అంశంపై సెమినార్ జరిగింది. ఉత్తరాంధ్ర జానపద కళలపై పరిశోధన చేసిన బద్రి కూర్మారావు మాట్లాడుతూ తన ఆటపాటలతో ఉర్రూతలూగించారు. ప్రముఖ సినీగేయ రచయిత డాక్టర్ అందెశ్రీ, పార్వతీపురం నుంచి వచ్చిన ప్రముఖ కవులు గంటేడ గౌరినాయుడు, సిరికి స్వామినాయుడు, బగాది వెంకటరావు, తదితరులు ఉత్తరాంధ్ర యాస భాషపై ప్రసంగించారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మాజీ చైర్మన్ వజ్జ బాబూరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పి.వి.సతీష్ తదితరులు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర కళలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఉద్దానం సాహితీ సాంస్కృతి వేదిక అధ్యక్షుడు చిక్కోలు జగదీస్, కార్యదర్శి లండ రుద్రమూర్తి, కార్యవర్గ సభ్యులు నిశితాసి, గుమ్మడి సాంబమూర్తి, కుత్తుం వినోద్, శివజ్యోతి, కాళిదాసు, తెప్పల కృష్ణమూర్తి, దాసరి తాతారావు, డాక్టర్ బిఆర్అంబేద్కర్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు దానేటి పద్మ, శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ కో-ఆర్డినేటర్‌గా పీవీజే రాజు



జోనల్ స్థాయిలో పీవీజే రాజును సత్కరించిన ఈకోర్సు ప్రముఖులు



పీవీజే రాజు

భువనేశ్వర్: తూర్పుకోస్తా రైల్వే శ్రామిక్ యూనియన్(ఈకోర్సు) వాల్తేర్ డివిజన్ నూతన సమన్వయకర్తగా పీవీజే రాజు ఎన్నిక ఖరారైనట్లు ప్రధాన కార్యదర్శి పీకే పటసహాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఈ హోదాలో బాధ్యతలు స్వీకరించిన నుంచి 2 ఏళ్ల పాటు నిరవధికంగా కొనసాగుతారని తెలిపారు. ఆయన వాల్తేర్ మండలంలో 7వ ఈకోర్సు సమన్వయకర్తగా ఎన్నిక కావడం విశేషం. వాల్తేర్ మండల వ్యాప్తంగా రైల్వే సిబ్బంది సమస్యల పరిష్కారం, సంక్షేమం కార్యకలాపాల వ్యవస్థను సంస్కరణ బాటలో నడిపించడం ధ్యేయమని పీవీజే రాజు పేర్కొన్నారు. డివిజన్ స్థాయి కొత్త కార్యవర్గం ఏకతాటిపై నడిపించి లక్ష్య సాధనకు కృషి చేయడం జరుగుతుందన్నారు.

ఆల్‌రౌండ్ చాంపియన్‌గా విశాఖ



ఆల్‌రౌండ్ చాంపియన్‌గా నిలిచిన విశాఖపట్నం అథ్లెట్స్ బృందంతో ఎంపీ, నిర్వహణ కమిటీ ప్రతినిధులు

- ముగిసిన అండర్-14, 17 రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలుపోటీలు
- నేడు, రేపు అండర్-19 విభాగాల పోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరుగుతున్న 66వ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-14, అండర్-17 బాలబాలికల పోరు ముగిసింది. అథ్లెటిక్స్ పోటీల ఆల్‌రౌండ్ చాంయన్‌షిప్‌గా విశాఖపట్నం నిలిచింది. ఆతిథ్య శ్రీకాకుళం జిల్లా 77 పాయింట్లతో ద్వితీయ స్థానం, విజయనగరం 74 పాయింట్లతో తృతీయ, వైఎస్సార్ కడప 67 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాయి. వ్యక్తిగత విభాగాల్లో అండర్-14 బాలుర విభాగంలో పి.సాయికిరణ్ (శ్రీకాకుళం) 777 పాయింట్లతో, బాలికల విభాగంలో పి.ప్రవల్లికారెడ్డి (విశాఖపట్నం) 710 పాయింట్లతో చాంపియన్లగా నిలిచారు. అండర్-17 బాలుర విభాగంలో పి.రూబేష్‌బాబు (కృష్ణా) 773 పాయింట్లతో, బాలికల విభాగంలో పి.తిరీషా (విశాఖపట్నం) 812 పాయింట్లతో వ్యక్తిగత చాంపియన్లగా నిలిచి బహుమతులు అందుకున్నారు. విజేతలగా నిలిచిన క్రీడాకారులకు శ్రీకాకుళం ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు పతకాలు, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లాలో రాష్ట్ర స్కూల్‌గేమ్స్ పోటీలను నిర్వహించడం గర్వకారణమన్నారు. కాగా ఆది, సోమవారాల్లో అండర్-19 విభాగంలో బాలబాలికలకు పోటీలు జరగనున్నాయి. ఇప్పటికే 13 జిల్లాల క్రీడాకారులు మైదానం వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో డీఈఓ గార పగడాలమ్మ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి పి.సుందరరావు, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎం.వి.రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎం.తిరుపతిరావు, పి.తవిటయ్య, కె.హరిబాబు, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత, మీట్ పరిశీలకులు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ పోటీలకు వల్లాపురం విద్యార్థి


రెల్లి దేవి

గుర్ల: జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు వల్లాపురం హైస్కూల్ విద్యార్థిని రెల్లి దేవి ఎంపికైనట్టు హైస్కూల్ పీడీ ఎం.తిరుపతిరావు శనివారం తెలిపారు. ఈ నెల 11, 12 తేదీలలో అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో దేవి ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. ఈ నెల 22, 23, 24 తేదీలలో అనకాపల్లిలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నట్టు పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన దేవిని పాఠశాల హెచ్ఎం అప్పారావు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

పంట కాలువలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్


ప్రమాదానికి గురయిన బస్సు

బొబ్బిలి: పట్టణంలోని సురేష్ స్కూల్‌కు చెందిన స్కూల్ బస్సు విద్యార్థులను ఇళ్లకు తీసుకువెళ్తూ రంగరాయపురం, అప్పయ్యపేటల మధ్య ఉన్న కాల్వలోకి శనివారం దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సులో 30 మంది విద్యార్థులున్నారు. అదృష్టవశాత్తూ ప్రమాదం జరిగిన సమయంలో విద్యార్థులెవరికీ ఎటువంటి గాయాలు తగలకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే స్కూల్ బస్సు ప్రమాదానికి గురయిందనే విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. కేవలం సురేష్ స్కూల్‌కు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులే కాకుండా అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఏ బస్సు ప్రమాదానికి గురయిందంటూ ఆరా తీయడం కనిపించింది.

ఆటో బోల్తా - ముగ్గురికి గాయాలు

బొబ్బిలి: గున్నతోటవలస వెళ్లే దారిలో మసీదు వద్ద ఆటో బోల్తా పడిన సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. శనివారం మధ్యాహ్నం గున్నతోటవలస నుంచి ప్రయాణికులతో బొబ్బిలి రైల్వేస్టేషన్‌కు వెళ్తున్న ఆటో అదుపుతప్పి ఒరిగి పోయింది. ఈ ప్రమాదంలో అల్లు శ్రీనివాసరావు, బడబల్ల నాగమణి, పప్పల పార్వతి గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్‌లో బొబ్బిలి ఆస్పత్రికి తరలించారు.

నైపుణ్యాభివృద్ధితో ఉపాధి



మాట్లాడుతున్న గిరిజన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: ప్రతి విద్యార్థి పాఠ్యాంశ విద్యతోపాటు ఉపాధి కల్పించే నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని కేంద్రియ గిరిజన విశ్వ విద్యాలయం వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి పిలుపునిచ్చారు. వర్సిటీలో 'భారతదేశంలో విద్యా సంస్కరణలు–ఉపాధ్యాయుల పాత్ర' అనే అంశంపై శనివారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమాజంలో రాబోయే మార్పులను ముందుగానే గ్రహించి వాటికి అనుగుణంగా విద్యాకోర్సులు, సిలబస్‌ను రూపొందించాలన్నారు. అఖిల భారత రాష్ట్రీయ శిక్షక్ మండలి జాయింట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ గుంత లక్ష్మణ్ మాట్లాడుతూ సమాజాన్ని చైతన్య పరిచేందుకు సామాజిక అంశాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. స్వామి వివేకానంద, సుభాస్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని 'కర్తవ్యబోధన దివస్' నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మిగులు ధాన్యం కొనుగోలుకు యాప్

- చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి
- ఏఏబీ సమావేశంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: జిల్లాలో రైతుల వద్ద మిగిలిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, అందుకోసం ప్రభుత్వం ఒక యాప్‌ను రూపొందించినట్లు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయిన జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందవద్దని, మిగిలిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడానికి పారదర్శకంగా ప్రక్రియ జరగడానికి కొత్త నిబంధనలను రూపొందించడం జరిగిందన్నారు. మధ్యవర్తులను నమ్మి తక్కువ ధరకు అమ్మవద్దని, రెండు రోజుల్లో ధాన్యపు రాశులను ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుందని చైర్మన్ తెలిపారు. సుమారు లక్ష టన్నుల ధాన్యం కొనుగోలుకు రైతుల వద్ద ఉన్నట్లు ఈ క్రాప్ డేటా ద్వారా అంచనా వేయడం జరిగిందని ఆ మేరకు కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. త్వరలో కొనుగోళ్లు జరుగుతాయని రైతులు సహకరించాలని కోరారు. ధాన్యం సేకరణలో జిల్లాలో ఇప్పటికే లక్ష్యాలను మించి కొనుగోలు చేశామన్నారు. రవాణా, హమాలీ ఖర్చులను కూడా ప్రభుత్వమే భరించి రైతుల ఖాతాల్లోనే జమ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో రెండు రోజుల పాటు జరగనున్న చిరుధాన్యాల వర్క్ షాప్‌కు ప్రతి మండలం నుంచి కనీసం 20 మంది చిరుధాన్యాలు పండించే రైతులను తీసుకురావాలని వారికీ ఉత్తమ పద్ధతులపై అవగాహన కలిగించాలని తెలిపారు. రెండు రోజుల వర్క్ షాప్‌లో ఎంతమంది రైతులు పాల్గొన్నారో సంఖ్యను తెలియజేయాలని తెలిపారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు జిల్లాలో మిగిలిన నియోజకవర్గాల కంటే ఎస్.కోట నియోజకవర్గానికి తక్కువగా కేవలం 39 శాతం మాత్రమే లక్ష్యం ఇచ్చారని దీనివల్ల ధాన్యం సేకరణ తక్కువయిందన్నారు. నియోజకవర్గంలో రైతుల వద్ద భారీగా నిల్వలు ఉన్నాయని ప్రత్యేకించి పరిష్కారం చూపాలని కోరారు. కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ సీడ్ విలేజ్‌ల ద్వారా స్థానికంగా విత్తనాలను అభివృద్ధి చేయాలని దీని వల్ల రైతులకు రవాణా చార్జీలు తగ్గడమే కాకుండా స్థానిక వాతావరణ పరిస్థితికి తగ్గట్టుగా పంట దిగుబడి ఉంటుందని తెలిపారు. వచ్చే ఖరీఫ్ నాటికి ఈ విత్తనాలను అందించాలని జేడీ త్రినాథస్వామికి సూచించారు. ఎరువులు అమ్మకంలో నగదు తీసుకోకుండా డిజిటల్, ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లించేలా రైతులకు అవగాహన కలిగించాలని దీని వలన ఎటువంటి అవినీతికి తావుండదని తెలిపారు. పీఎం కిసాన్ ఈకేవైసీ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని లేకుంటే వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి అందవలసిన ఆర్థిక సహాయం నిలిచిపోతుందని అన్నారు. సమావేశంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రధాని మాట్లాడిన షార్ట్ ఫిలింను ప్రదర్శించారు. అనంతరం క్యాలెండర్, పోస్టర్, డైరీలను ఆవిష్కరించారు. సమావేశంలో ఏఏబీ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఎంఎల్‌సీ ఇందుకూరి రఘురాజు, ఐసీసీబీ చైర్మన్ చిన్న రామినాయుడు, వ్యవసాయ సంబంధింత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పరిష్కారం కాని సమస్యలపై చర్చించండి : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: మండల స్థాయిలో జరిగిన సఖి సమావేశంలో పరిష్కరించలేని అంశాలను జిల్లా స్థాయి సమావేశంలో చర్చించాలని కన్వర్జెన్స్ సమావేశంలో చర్చించి పరిష్కారాన్ని చూడాలని కలెక్టర్ సూర్యకుమారి అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి సఖి సమావేశం కలెక్టర్ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మండలాల వారీగా జరుగుతున్న సమావేశాలపై సమీక్షించారు. ఎలాంటి సమస్యలు వస్తున్నాయి, ఎలా పరిష్కారం జరుగుతున్నాయి అనే అంశాలపై ఆరా తీశారు. కొత్తగా వివాహం జరిగిన జంటలను గ్రూప్‌లుగా చేయడం, వారితో సమావేశాలు నిర్వహించడం ఎలా జరుగుతోందనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశాలకు తప్పనిసరిగా సర్పంచ్‌లు హాజరు కావాలని అప్పుడే ఆ గ్రామానికి చెందిన సమస్యలు వారికి తెలియడమే కాకుండా తగు పరిష్కారం కూడా లభిస్తుందని పేర్కొన్నారు. అందుకోసం జిల్లా పంచాయితీ అధికారి సర్పంచ్‌లందరికీ సర్క్యులర్ జారీ చేయాలని సూచించారు. సఖీ సమావేశాలు ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలతో పాటు హాస్టల్స్ కూడా నిర్వహించాలని తెలిపారు. ప్రతి 4వ శనివారం సాయంత్రం 4 నుండి 5 గంటల మధ్య పాఠశాలలో 1 గంట సఖి సమావేశాలకు తప్పనిసరిగా ప్రధానోపాధ్యాయులు కేటాయించాలని సూచించారు. అందుకు ఒక సర్క్యులర్ జారీ చేయాలని డీఈఓకు ఆదేశించారు. నెహ్రూ యువ కేంద్రం ద్వారా యువతకు కౌన్సెలింగ్, అవగాహన జరపాలని కో ఆర్డినేటర్ విక్రంకు సూచించారు. గృహాలలో ఉన్నత చదువు చదివి ఖాళీగా ఉన్న మహిళలను గుర్తించి వారికి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు తగు శిక్షణలు ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతకుమారి, డీఎంహెచ్ఓ డాక్టర్ రమణకుమారి, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, జిల్లా పంచాయతీ అధికారి నిర్మలదేవి, సీపీఓ పి.బాలాజీ, మండల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం

శృంగవరపుకోట : పట్టణంలోని విశాఖ - అరకు రోడ్డులో శుక్రవారం రాత్రి 10గంటల సమయంలో ఆకుల డిపో వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 23 సంవత్సరాల వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. విశాఖ వైపు వెళ్తున్న ఐషర్ వ్యాన్, లక్కవరపుకోటలో తన అక్కను చూసి తిరిగి మెంటాడ మండలంలో పిట్టాడ గ్రామానికి బైక్‌పై వెళ్తున్న మోసేస్‌ను స్థానిక ఆకుల డిపో వద్ద ఢీకొట్టింది. తీవ్ర గాయాల పాలైన మోసేస్ సంఘటనా స్థలిలోనే ప్రాణాలు వదిలాడు. మృతుడు గొర్లె మోసేస్ మెంటాడ మండలం పిట్టాడ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతునికి భార్య, ఒక కుమార్తె ఉంది. మృతుని భార్య గొర్లె నాగేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ తారకేశ్వరరావు చెప్పారు.

హత్య కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు

తెర్లాం: మండలంలోని వెలగవలస మామిడి తోటలో గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసుకు సంబంధించి పోలీసులు శనివారం నుంచి అన్ని కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ నెల 16న గ్రామానికి చెందిన ఓ మామిడి తోటలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. ఆ మృతదేహంపై కత్తి పోట్లు, గాయాలు ఉండడంతో దీనిని హత్య కేసుగా నమోదు చేసి ఎస్పీ దీపికాపాటిల్ ఆదేశాల మేరకు బొబ్బిలి డీఎస్పీ మోహన్‌రావు ఆధ్వర్యంలో బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే సంఘటనా స్థలంలో క్లూస్ టీంల ద్వారా, ఫోరెన్సిక్ ల్యాబ్ అధికారులతో తనిఖీలు చేశారు. తెర్లాం, బాడంగి, రామభద్రపురం ఎస్‌ఐలు బి.రమేష్, జయంతి, సురేంద్రనాయుడు మూడు బృందాలుగా ఏర్పడి సంఘటనా స్థలానికి 200మీటర్ల మేరకు ఆధారాల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బొబ్బిలి రూరల్ సీఐ స్థానిక సిబ్బందితో కలిసి సీసీ పుటేజ్‌లను పరిశీలించారు. ఇదిలా ఉండగా హత్య కేసుకు సంబంధించి శనివారం నుంచి పోలీసులు దర్యాప్తు మరింత వేగవంతం చేశారు. ఈ సంఘటనకు పాల్పడింది ఒడిశా, ఇతర ప్రాంతాలకు చెందిన వారు కావచ్చేమోనని ఆ దిశలో కూడా దర్యాప్తు చేపడుతున్నారు. ఈ నెల 12 నుంచి రాత్రి వేళల్లో తిరిగే వాహనాల రాకపోకలపై దృష్టి సారించారు. ఇదే విషయమై బొబ్బిలి రూరల్ సీఐ, తెర్లాం ఎస్ఐ వద్ద ప్రస్తావించగా గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసుపై ఎస్పీ, బొబ్బిలి డీఎస్పీ ఆదేశాల మేరకు అన్ని కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేశామని తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కి బురిడి

బాడంగి : అత్తారింటికి వెళ్లి బస్సులో తిరిగి వస్తున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను తన పక్కనే కూర్చొన్న ఓ వ్యక్తి నమ్మించి మత్తులో పెట్టి బ్యాగ్‌ను మాయం చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన వీవీఎస్ మణికంఠ బెంగళూరులో పని చేస్తున్నాడు. వర్క్ ఫ్రం హోంలో భాగంగా ఇంటి నుంచే పని చేస్తున్నాడు. సంక్రాంతి పండుగ అని ఒడిశాలోని బరంపురం మూడు రోజుల కిందట వెళ్లాడు. శుక్రవారం రాత్రి పది గంటలకు జగదల్‌పూర్ బస్సులో తిరుగు పయనమయ్యాడు. పక్కన ఉన్న వ్యక్తి మాటలు కలుపుతూ తినేందుకు బిస్కట్ ఇచ్చాడు. అది తినగానే మత్తుగా భావించి వదిలేశాడు. మత్తులోకి వెళ్లిన మణికంఠ స్పృహ కోల్పోవడంతో బంగారు గొలుసు, ఉంగరం, పర్సు, ఏటీఎం కార్డు, ల్యాప్‌టాప్‌తో ఉన్న బ్యాగ్‌ను పట్టుకుపోయాడు. శుక్రవారం రాత్రి 1 గంటకు బాడంగిలో దిగాల్సిన మణికంఠ దిగలేదు. శనివారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో మణికంఠ తండ్రి కాశీ విశ్వేశ్వరరావుకు ఫోన్ వచ్చింది. మీ అబ్బాయి రామభద్రపురం జంక్షన్ వద్ద గాంధీ బొమ్మ వద్ద తెలివి తప్పి ఉన్నట్టు సమాచారం ఇవ్వడంతో తండ్రి ఆటో పట్టుకు వెళ్లి ఇంటికి తీసుకువచ్చారు. జరిగిన సంఘటన తండ్రి తెలుసుకొని చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్పించారు.


గూడ్స్ రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతి

కొత్తవలస : స్థానిక రైల్వేస్టేషన్‌కు సమీపంలో శనివారం ఉదయం గూడ్స్ రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి బి.వెంకటరావు(38) అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చోటుచేసుకొంది. కొత్తవలస రైల్వే ఎస్ఐ వికాస్‌నాయక్, స్థానికులు తెలిపిన వివరాలు... వెంకటరావు స్థానిక రైల్వేస్టేషన్‌లో సహాయ సిగ్నల్ కలాసీగా పని చేస్తున్నాడు. శనివారం తెల్లవారు జామున ఆరో నంబరు ట్రాక్ పరిశీలన నిమిత్తం వెళ్లగా విశాఖ వైపు వెళ్తున్న గూడ్స్ ట్రైన్ ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిది అనకాపల్లి అని రైల్వే అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బాడంగి: మండలంలోని గొల్లాది గ్రామానికి చెందిన గండేటి శ్రీను(42) విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు... మృతుడు శ్రీనుకు మద్యం సేవించే అలవాటు ఉండడంతో కనుమ రోజు పూటుగా మద్యం సేవించాడు. మద్యం తాగితే ఆయనకు కడుపునొప్పి వచ్చేది. కనుమ రోజు కూడా అలాగే కడుపునొప్పి రావడంతో భరించలేక పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విశాఖకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతదేహానికి కేజీహెచ్‌లో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని తండ్రి సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి


సూర్యనారాయణ మృతదేహం

బొబ్బిలి రూరల్: పారాదికి చెందిన ఎడ్ల సూర్యనారాయణ(55) శనివారం పురుగుల మందు తాగి మృతి చెందాడు. మృతుడికి భార్య ఆదిలక్ష్మి, కుమారుడు నవీన్‌కుమార్ ఉన్నారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు.. సూర్య నారాయణ పెద్దకుమారుడు నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, మనస్తాపంతో మద్యానికి అలవాటుపడ్డారు. భార్య, కుమారుడు మద్యం సేవించవద్దని వారిస్తుండడంతో శనివారం ఉదయం మద్యంలో పురుగుల మందు కలిపి సేవించడంతో సూర్యనారాయణ మృతి చెందాడు. మృతదేహానికి బొబ్బిలి సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్ల క్రమశిక్షణతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

- జిల్లా రవాణాధికారి సుందర్


సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సుందర్

విజయనగరం క్రైమ్: రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రాణ నష్టం జరగకుండా నివారించడమే రోడ్డు భద్రతా వారోత్సవాల ప్రధాన ఉద్దేశమని జిల్లా రవాణాధికారి సుందర్ పేర్కొన్నారు. స్వచ్ఛత పక్వాడ కింద నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక లంకాపట్నంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించే లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులను విస్తరించడం, రోడ్డుకు ఇరువైపులా సర్వీసు రోడ్డు నిర్మాణం వంటి ఎన్నో చర్యలు చేపడుతోందన్నారు. దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో లారీల కారణంగా జరుగుతున్నవి తక్కువశాతం మాత్రమేనని, అయినప్పటికీ లారీ డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. లారీ డ్రైవర్లలో కేవలం ఐదుశాతం మంది మాత్రమే క్రమశిక్షణ పాటించక వాహన ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. డ్రైవర్లు సుదూర ప్రాంతాలకు వాహనాలను నడుపుతున్న కారణంగా తగినంత విశ్రాంతి లేక ప్రమాదాలకు గురవుతున్నారని ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు పేర్కొన్నారు. రోడ్ సేఫ్టీ సంస్థ ప్రతినిధి మజ్జి అప్పారావు, రవాణా శాఖ అధికారులు దుర్గాప్రసాద్, రమణ, లారీ యజమానులు పాల్గొన్నారు.

అ'పూర్వ'సమ్మేళనం


1996-2003 బ్యాచ్ సైనిక్ పాఠశాల పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాల 1996–2003 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం శనివారం అట్టహాసంగా జరిగింది. సిల్వర్ జూబ్లీ వేడుకలను వారి కుటుంబ సభ్యులు, విద్యార్థులతో కలిసి ఆనందంగా నిర్వహించారు. పాఠశాల పరిసరాలు, తరగతిగదులు, ఇతర ప్రదేశాలను వారి కుటుంబ సభ్యులతో సందర్శించి ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనంద పరవశులయ్యారు. పూర్వ విద్యార్థులు వారి బాల్యం గుర్తులు, పాఠశాల తరపున వారు సాధించిన ఘన విజయాలను జ్ఞప్తికి తెచ్చుకుని కుటుంబ సభ్యులతో పంచుకున్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న ఉద్యోగం, వారు చేరుకున్న ఉన్నత స్థానాలు, వారి ఉన్నతికి కారణమైన పాఠశాల, ఉపాధ్యాయులు అందించిన సహకారాన్ని ప్రస్తుత విద్యార్థులతో పంచుకున్నారు. ప్రతిఒక్కరూ తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకుని మాతృభూమికి సేవలందించాలన్నారు. అనంతరం తమ ఉన్నతికి కృషి చేసిన ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించారు.

ఉపాధ్యాయుడి వక్రబుద్ధి..!


పాఠశాల గేటు వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

- విద్యార్థినిపై అసభ్యకర ప్రవర్తన
- ఆందోళనకు దిగిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు
- చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు

రాజాం/సంతకవిటి: విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పి సన్మార్గంలో నడిపించాల్సిన గురువు దారి తప్పాడు. పాఠశాలలో చక్కగా చదువుకునే ఆరో తరగతి చిన్నారిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన సంతకవిటి మండలం అప్పలఅగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో ఆలస్యంగా వెలుగుచూసింది. పండగ సెలవుల తర్వాత ఆ చిన్నారి పాఠశాలకు వెళ్లనంటూ మారాం చేసింది. ఎందుకని ప్రశ్నిస్తే.. పాఠశాల హెచ్ఎం అప్పలరాజు ఉన్నంత వరకు పాఠశాలకు వెళ్లనంటూ తెగేసి చెప్పడంతో తల్లిదండ్రులు ఆరా తీశారు. హెచ్ఎం వక్రబుద్ధిని తెలుసుకున్నారు. గ్రామంలోని గణేష్ యువజన సంఘం యువకులతో కలిసి శనివారం 100కు ఫోన్‌చేసి ఫిర్యాదుచేశారు. విద్యార్థులతో కలిసి పాఠశాల వద్ద ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న సంతకవిటి ఏఎస్ఐ వాసుదేవరావు తన సిబ్బందితో కలిసి పాఠశాలకు చేరుకున్నారు. ఘటనపై ఆరా తీశారు. అప్పటికే విషయం హెచ్ఎంకు తెలియడంతో ఎంఈఓ కార్యాలయానికి వెళ్తున్నట్టు చెప్పి ఉడాయించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జనార్దనరావు తెలిపారు.

హిందీ మేడమ్‌కు చెప్పినా..

హెచ్ఎం వేధింపులను పాఠశాలలో పనిచేస్తున్న హిందీ మేడమ్ దృష్టికి చిన్నారి తీసుకెళ్లిందని, పాఠశాల ప్రతిష్టదెబ్బతింటుందన్న ఉద్దేశంతో ఆమె చిన్నారికి సర్దిచెప్పినట్టు గ్రామ యువకులు తెలిపారు. హెచ్ఎం మద్యం సేవించి విధులకు హాజరవుతున్నారన్నారు. ఈ ఘటనపై సంతకవిటి ఎంఈఓ బి.శాంతికుమారి వద్ద ప్రస్తావించగా పాఠశాల హెచ్ఎం తీరుపై తనకు ఈరోజు ఫిర్యాదు వచ్చిందని, చర్యలు తీసుకుంటామని చెప్పారు. వర్క్ ఎడ్జెస్ట్‌మెంట్‌తో ఆయనను వాల్తేరు ఉన్నత పాఠశాలకు వేశామని, అక్కడికి వెళ్తానని చెప్పి ఇంటికి వెళ్లిపోయాడని తెలిపారు. ఇదిలా ఉండగా తన తల్లికి బాగులేని కారణంగా పాఠశాల నుంచి వెళ్లిపోయానని, తనపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని హెచ్ఎం అప్పలరాజు 'సాక్షి'కి తెలిపారు.

జేఎన్‌టీయూకే మహిళల బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

రాజాం సిటీ: జేఎన్‌టీయూకే మహిళల బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక పోటీలు జీఎంఆర్ ఐటీలో శనివారం జరిగాయి. జేఎన్‌టీయూకే అనుబంధ కళాశాలల క్రీడాకారులు పోటీల్లో తలపడ్డారు. వీరిలో ప్రతిభ చూపిన 10 మందిని ఈ నెల 27 నుంచి 30 వరకు చెన్నై సీఐఎస్‌టీలో జరగనున్న అంతర్‌వర్సిటీ పోటీలకు ఎంపిక చేశారు. పోటీలను ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, పాలకొండకు చెందిన ఇంటర్నల్ మెంబర్ కె.మోహన్, విశాఖకు చెందిన ఎక్స్‌ట్రనల్ మెంబర్ ఎస్.మంగళగౌరి, టెక్కలికి చెందిన జేఎన్‌టీయూ అబ్జర్వర్ ఎస్.లక్ష్మణమూర్తి పర్యవేక్షించారు. ఎంపికైన విద్యార్థినులను డాక్టర్ జి.శశికుమార్, పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ అభినందించారు.

ఎంపికైన జట్టు ఇదే...

పి.అవ్యక్త, డి.షిరియా (జీఎంఆర్‌ఐటీ, రాజాం), వి.శ్రీసమదర్శిని, షేక్‌ముల్లా మహిన్, షేక్ నజ్మా (జీవీపీసీఓఈ, విశాఖపట్నం), షేక్ నస్రీన్‌చాందిని, డి.ప్రజ్ఞ, పి.కీర్తి (ఎస్‌ఆర్‌జీఈసీ, గుడ్లవెల్లూరు), ఎస్.తేజశ్రీ (కేఐఈటీ, కొరంజ్), పి.శ్రీపావని (శ్రీవాసవీ ఇంజినీరింగ్ కళాశాల) ఉన్నారు.

రైతుకు దక్కిన మద్దతు ధర

- 80 కిలోల బస్తాకు రూ.300 వరకు లబ్ధి
- ఆర్‌బీకేకు ధాన్యం విక్రయించడంతో అదనపు ఆదాయం
- 2.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించిన రైతులు


రైస్ మిల్లు వద్ద ధాన్యం దించుతున్న కూలీలు

విజయనగరం ఫోర్ట్: రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు ఆశించిన మద్దతు ధర లభించింది. గతంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక దళారులు నిర్ణయించిన ధరకు ధాన్యం విక్రయించేవారు. 80 కిలోల బస్తావద్ద రూ.300 నుంచి రూ.400 వరకు నష్టపోయేవారు. ఆరుగాలం శ్రమించి వరి పండించిన రైతన్నకు గిట్టుబాటు ధర అందేది కాదు. ఈ సారి ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకే రైతులు విక్రయించారు. వరి క్వింటాకు సాధారణ రకం రూ.2,040, ఏ–గ్రేడ్ రకానికి రూ.2,060 మద్దతు ధర పొందారు.

2,30,692 ఎకరాల్లో వరి సాగు..

జిల్లాలో గత ఖరీఫ్ సీజన్‌లో 2,30,692 ఎకరాల్లో 1,74, 550 మంది రైతులు వరి పంటను సాగు చేశారు. ఇప్పటి వరకు 2.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు విక్రయించారు. రైతుల లెక్క ప్రకారం ఆర్‌బీకేలో విక్రయించిన ధాన్యం బస్తాకు (80కిలోలు) రూ.300 వరకు లబ్ధి చేకూరింది. 80 కిలోల బస్తాను వ్యాపారులు రూ.1300 నుంచి రూ.1350కు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం 80 కిలోల బస్తాను రూ.1632కు కొనుగోలు చేస్తోంది. 100 బస్తాలు విక్రయించిన రైతుకు రూ.30 వేలు వరకు అదనంగా ఆదాయం వస్తోంది. మరోవైపు రైతుల ఖాతాల్లో 21 రోజుల్లోనే డబ్బులు జమవుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఆనందంగా ఉంది..



నేను మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. ఏడాది పొడవునా తినడానికి ధాన్యం ఉంచుకోగా 60 బస్తాల వరకు వ్యాపారులకే విక్రయించేవాడిని. ఈ ఏడాది రైతు భరోసా కేంద్రంలో ధాన్యం విక్రయించాను. వ్యాపారికి విక్రయించిన దానికంటే బస్తాకు (80 కిలోలు) రూ. 300 చొప్పున అదనంగా వచ్చింది. చాలా ఆనందంగా ఉంది. ఇకపై ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే విక్రయిస్తాను. కష్టానికి తగిన ఫలితం వచ్చింది.

– పాలేపు నూకరాజు, రైతు, పెదవేమలి గ్రామం

27న రాష్ట్ర స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలు

- రాజీవ్ క్రీడామైదానం వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న పోటీలు
- పోటీల్లో పాల్గొననున్న 10 కబడ్డీ జట్లు, 8 ఖోఖో జట్లు


సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.కుమార్

విజయనగరం: క్రీడల ఖిల్లా విజయనగరం వేదికగా రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి ఆహ్వానపు కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్టు ఖోఖో క్రీడాకారుడు, ఎస్‌ఆర్‌ఐ కె.కె.కుమార్ తెలిపారు. నగరంలోని కంచర్ల టవర్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు రాజీవ్ క్రీడామైదానం వేదికగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఖోఖో క్రీడాంశంలో విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, ప్రకాశం, నెల్లూరు జట్లు పాల్గొంటాయని తెలిపారు. కబడ్డీ క్రీడాంశంలో ఉత్తరాంధ్ర జిల్లాలైన విజయనగరం, విశాఖ పట్టణం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 10 జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయని చెప్పారు. రెండు క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన మొదటి జట్టుకు రూ.30వేలు, ద్వితీయ స్థానం దక్కించుకున్న జట్టుకు రూ.20వేలు, తృతీయ, నాల్గవ స్థానాలు దక్కించుకున్న జట్లకు రూ.15వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు బహూకరిస్తామన్నారు. కబడ్డీ, ఖోఖో పితామహుడు స్వర్గీయ భగవాన్‌దాస్ మాస్టారు వద్ద ఖోఖో క్రీడను నేర్చుకున్నాని, అనంతరం కాలంలో అమెరికాలో స్థిరపడినట్టు తెలిపారు. స్వదేశానికి వచ్చినప్పుడు క్రీడల పట్ల తనకున్న మక్కువతో ఆహ్వానపు ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. కంచర్ల మున్సిపల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రతినిధి పి.చిన్నంనాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.ఎ.బాలకృష్ణ, కోరాడ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.